# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 02-05-2017**

మిషన్ భగీరథ పనులపై ఇక నుంచి ప్రతీ రోజు పర్యవేక్షించాలని, అనుకున్న ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి గోదావరి, కృష్ణా జలాలు గ్రామాలకు చేరుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పనుల్లో వేగం పెరగాల్సిన అవసరం ఉందని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వర్కింగ్ ఏజన్సీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇంజనీర్లు సమన్వయంతో పనిచేసి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలని సీఎం కోరారు. పైపు లైన్లతో పాటు ఫైబర్ కేబుల్ కూడా నిర్మించాలని, ఇంటింటికి మంచినీళ్లతో పాటు ఇంటింటికి ఇంటర్నెట్ సౌకర్యం కూడా అందించి అమెరికా సరసన తెలంగాణ నిలవాలని సిఎం చెప్పారు. మిషన్ భగీరథ పనులపై ప్రగతి భవన్లో సోమవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ వైస్ చైర్మన్ శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపి శ్రీ కె. కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.పి. సింగ్, సలహాదారు శ్రీ జ్ఞానేశ్వర్, ముఖ్య కార్యదర్శులు శ్రీ నర్సింగ్ రావు, శ్రీ రామకృష్ణరావు, శ్రీ జయేష్ రంజన్, ఇంజనీర్లు, వర్కింగ్ ఏజన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు అన్నీ త్వరితగతిన నిర్మాణం కావాలని, కొన్ని చోట్ల తలెత్తిన ఇబ్బందులను తొలగించుకోవాలని చెప్పారు. పనుల్లో జాప్యం చేసే వర్కింగ్ ఏజన్సీలు తమ పద్ధతి మార్చుకోవాలని, పనులు ఒప్పందం ప్రకారం వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. వర్షాకాలం వచ్చేలోగా పంట పొలాల్లో జరగాల్సిన పనులన్నీ పూర్తి చేయాలని చెప్పారు. ఇన్టేక్ వెల్స్ గానీ, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు గానీ నిర్మాణం అయ్యే కొద్దీ వెంటనే ఒక్కొక్కటిగా వాడకంలోకి తేవాలని సీఎం చెప్పారు. మిషన్ భగీరథకు కావాల్సిన విద్యుత్ సౌకర్యం అందించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని జెన్ కో సిఎండి ప్రభాకర్ రావును సిఎం కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**